# అక్రమ వెంచర్‌పై అధికారుల చర్యలు


చెరువు ఫీడర్‌ఛానల్‌ను తొలగింపజేస్తున్న ఇరిగేషన్ ఏఈ మౌనిక

- కాముని చెరువు ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ
- వెంచర్ నిర్వాహకులపై నోటీసులకు సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్: పట్టణంలోని కాముని చెరువు సమీపంలో ప్రైవేటు వ్యక్తులు ఇటీవల కాముని చెరువు ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేసి దానిని పూర్తిగా చదును చేసి తమ వెంచర్‌లో కలిపేసుకున్నారు. ఈ విషయమై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'అక్రమార్కుల బరితెగింపు' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఈఈ దూదునాయక్ ఆదేశాల మేరకు ఏఈ మౌనిక ఇతర సిబ్బంది అక్రమార్కులు మూసివేసిన ఫీడర్ ఛానల్ కాల్వకు కొలతలు వేసి జేసీబీతో తవ్వించారు. మరోవైపు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నోటీసులు సిద్ధం చేసుకుని సంబంధిత వెంచర్ వద్దకు వెళ్లారు. అక్కడ వాటిని తీసుకునేందుకు ఎవరు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. వెంచర్ పనులను కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 'గో కార్టింగ్' పోటీల్లో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

మణికొండ: అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్(ఏఎస్ఎంఈ)కు అనుబంధంగా ఉన్న ఇంజినీరింగ్ క్లబ్‌లో జరిగిన గో కార్టింగ్ పోటీల్లో సీబీఐటీ కళాశాల విద్యార్థులకు మొదటి బహుమతి దక్కింది. జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో సుల్తాన్‌పూర్‌లో గురువారం జరిగిన పోటీల్లో సీబీఐటీ విద్యార్థులు తయారు చేసిన గో- కార్టింగ్ కారు అందరినీ ఆకర్షించి బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో పరిశోధన, సృజనాత్మకత, డిజైన్ పోటీల్లో పాల్గొనడం ప్రపంచ ఇంజినీరింగ్ అనుభవాన్ని పొందడంలో సహాయపడుతుందన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**హ్యాకథాన్‌తో వినూత్న పరిష్కారాలు**

మణికొండ: దేశ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక సాంకేతిక నిపుణులతో నిర్వహించే 24 గంటల హ్యాకథాన్‌తో వినూత్న సమస్యలకు పరిష్కారాలు, ప్రపంచ సవాళ్లకు సమాధానాలు లభిస్తాయని మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపాల్ ప్రొడక్ట్ మేనేజర్ మణిదీప్ అన్నారు. గండిపేటలోని సీబీఐటీ కళాశాలలో గ్లోబల్ టెక్నాలజీ లీడర్ మైక్రోసాఫ్ట్, ఎడ్‌టెక్ ప్లాట్‌ఫారం బైటెక్సెల్, సీబీఐటీలు సంయుక్తంగా నిర్వహించిన హ్యాకథాన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను ప్రేరేపించటం, ఏఐలో సమస్యల పరిష్కార నైపుణ్యాలను మెరుగుపర్చటం, పరిశ్రమ కోసం విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఇలాంటివి ఉపయోగపడతాయన్నారు. బీఈ, బీటెక్ విద్యార్థులు నిజ జీవిత సమస్యల పరిష్కార ప్రాజెక్టులను పరిష్కరించటానికి హ్యాకథాన్ దోహద పడుతుందన్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి 139 జట్లు పాల్గొనేందుకు నమోదు చేసుకోగా.. షార్ట్ లిస్ట్ ద్వారా 50 జట్లకు అవకాశం కల్పించారు. వారు 24 గంటల కోడింగ్ మారథాన్‌లో పాల్గొంటున్నారన్నారు. కోడింగ్, డిజైనింగ్, ప్రాజెక్ట్ బిల్డింగ్‌లో సంపూర్ణ విధానం, స్పష్టమైన ఉద్దేశంతో ఇందులో విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. బైటెక్సెల్ సహ వ్యవస్థాపకుడు చరణ్, సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


హ్యాకథాన్‌లో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

# అభివృద్ధికి చిరునామా మజ్లిస్ పార్టీ: కౌసర్


గోల్కొండలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధికి చిరునామా మజ్లిస్ పార్టీ అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ డివిజన్‌లోని చోటాబజార్, బడా బజార్, ఖాజీ గల్లీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి మజ్లిస్‌కి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి చేశామన్నారు. సాంకేతిక కారణాల వల్ల డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. వెంటనే ఆ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్న తమ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వృద్ధులు, వికలాంగులకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయని అటువంటి వారు కూడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి మజ్లిస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, ముజీబ్, అహ్మద్ బిన్ మోసీన్ బాకుల్కా, అజీజ్‌ఖాన్ తదితరులున్నారు.

# టార్గెట్.. ఎమ్మెల్యే..!



- కాంగ్రెస్‌లో చేరకపోవటంతో మారుతున్న పరిణామాలు
- బండ్లగూడలో కార్పొరేటర్ల పార్టీ మార్పు
- నార్సింగిలో అవిశ్వాసం
- పార్టీ మార్పులకు తెరతీసిన కాంగ్రెస్



రాజేంద్రనగర్ నియోజకవర్గం

మణికొండ: రెండుసార్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీ మార్పునకు సానుకూల సంకేతాలు ఇచ్చిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నారు. తనతో పాటు ఉన్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారి అభిప్రాయ సేకరణలో భాగంగా శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాలకు చెందిన నాయకులు పార్టీ మార్పును నిరసించారు. దీంతో ఆయన ఒక్కసారిగా యూటర్న్ తీసుకుని బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని ప్రకటించారు. ఇక అప్పటి నుంచి అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దలు నియోజకవర్గ నాయకులకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కేడర్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పరపతి తగ్గించాలని చూస్తున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**కాంగ్రెస్‌లోకి 8 మంది కార్పొరేటర్లు..**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు వేగంగా పావులు కదిపి ముందుగా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో పాటు 8 మంది కార్పొరేటర్లను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. అంతకు ముందే మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌తో పాటు నలుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు.

**ఇద్దరు మాత్రమే..**

బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు మాత్రమే వచ్చే ఎన్నికల్లో వారి సీటు లెక్కలను బేరీజు వేసుకుని బీఆర్ఎస్‌లో ఉండిపోయారు. దీంతో బండ్లగూడలో బీఆర్ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా చేయటంలో కాంగ్రెస్ నాయకులు సఫలమయ్యారనే చర్చ జరుగుతోంది.

**నార్సింగిలో ఇదే తీరు...**

నార్సింగి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి ఆరుగురు కౌన్సిలర్ల బలం మాత్రమే ఉండగా.. బీఆర్ఎస్ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్ల మద్దతు కూడగట్టి చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణానికి జిల్లా కలెక్టర్‌కు లేఖను అందజేశారు. దీంతో కోకాపేట, గండిపేట, నార్సింగి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి బీటలు పారుతున్నాయి. మరో ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

**శంషాబాద్ మండల పరిధిలో..**

బండ్లగూడ, నార్సింగి మున్సిపాలిటీల తరహాలోనే మణికొండ మున్సిపాలిటీల్లో కొందరు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డితో సన్నిహితంగా ఉండటం, ఆయన పార్టీ మారాలని ఒత్తిడి తెస్తుండటంతో త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. జీహెచ్ఎంసీ పరిధిలోని రాజేంద్రనగర్ కార్పొరేటర్లతో పాటు శంషాబాద్ మండల పరిధిలోని పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లకు గాలం వేసినట్టు వినికిడి. ఇదే జరిగితే ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఏకాకిగా మారతారా... లేక చేసేదేమి లేక కాంగ్రెస్‌లో చేరతారా.. అనే విషయమై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది.

## మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులు ఐక్యతతో మేడేను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉడంగడ్డ చౌరస్తాలో నిర్వహించిన మేడే వాల్‌పోస్టర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. మండల ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు రాజు, మండల సహ కార్యదర్శి సాయిలు, శీను, నర్సింలు, అశోక్, మురళి ,శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మద్దతు కోరిన బీజేపీ నేతలు

బండ్లగూడ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి గౌతమిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని టీడీపీ నేతలను కలిశారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కోరారు. రామేశ్వర్‌రావు, రాజుగౌడ్, రాజశేఖర్, రాఘవులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూకు ఇండియన్ పేటెంట్ మంజూరు


ప్రొ.రాజదురై చంద్రశేఖర్, విద్యార్థి డా.వినయ్‌ప్రదీప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఇండియన్ పేటెంట్ మంజూరు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి ప్రొఫెసర్ రాజదురై చంద్రశేఖర్, అతని పూర్వ పీహెచ్‌డీ విద్యార్థి డాక్టర్ వప్పు వినయ్ ప్రదీప్‌కు 'మాలిక్యులర్ సింగిల్-క్రిస్టల్ ఫోటోనిక్ మైక్రో-రెసోనాటర్స్ అండ్ ఫర్మేథింగ్ పర్మేషన్ ఆవిష్కరణ కోసం భారతీయ పేటెంట్ చేయబడింది. పేటెంట్ చట్టం 1970లోని నిబంధనలకు అనుగుణంగా 20 సంవత్సరాల కాలానికి ఈ పేటెంట్‌ను అందించారు. ప్రస్తుత ఆవిష్కరణ అనేక ఫోటోనిక్ అప్లికేషన్‌లలో ఉపయోగపడే పరమాణు సింగిల్ క్రిస్టల్‌తో కూడిన మైక్రో రెసోనేటర్‌లను అందిస్తుంది. ప్రొ.రాజదురై చంద్రశేఖర్ ఆర్గానిక్ సింగిల్-క్రిస్టల్ ఫోటోనిక్ భాగాలను రూపొందించే సాంకేతికతకు 'క్రిస్టల్ ఫోటోనిక్స్ ఫౌండ్రీ' అని పేరు పెట్టారు. ఇండియన్ పేటెంట్ పొందడం పట్ల పలువురు ప్రొఫెసర్లు వారిని అభినందించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో మైనర్ల తల్లిదండ్రులకు జరిమాన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి కోర్టు వద్ద ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారితో పాటు పోలీసుల తనిఖీలో వాహనాలను నడిపిన మైనర్ల తల్లిదండ్రులు శుక్రవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. 4 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాదాపు 500 మందికి పైగా రావడంతో కోర్టు పరిసరాలు కిక్కిరిసాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టు వద్ద వేచి ఉన్నారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ,నార్సింగి, రాయదుర్గంకు పోలీస్ స్టేషన్‌కు చెందిన 150 మంది కేసులను న్యాయమూర్తి పరిశీలించి జరిమాన విధించారు. సమయం ముగియడంతో మిగిలిన వారిని శనివారం రావాలని చెప్పారు.

## నేడు సెయింట్రెన్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: ఈనెల 27న గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామని మెహిదీపట్నం సెయింట్రెన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఏ.విజయరాణి అన్నారు. కళాశాల ఆడిటోరియంలో శనివారం 11గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. రివరెండ్ సిస్టర్ పి.ఆంథోనమ్మ పర్యవేక్షణలో ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు హాజరుకానున్నారు.

## యువకుడి అదృశ్యం

గచ్చిబౌలి: ఇంటర్వ్యూకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి ఓ యువకుడు అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయన్న తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా చింతరెడ్డి పాలెంకు చెందిన శ్రీధర్(22) గౌలిదొడ్డిలోని పీజీ హాస్టల్‌లో సోదరుడు సాయి ప్రతాప్‌తో కలిసి ఉంటున్నాడు. తిరుపతిలో ఇంటర్వ్యూ ఉందని చెప్పి ఈ నెల 24న సాయంత్రం 5 గంటలకు బయటకు వెళ్లాడు. 25న ఉదయం 11.30 ఫోన్ చేయగా ట్రైన్‌లో ఉన్నానని చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో శ్రీధర్ స్నేహితులను ఆరా తీయగా ఇంటర్వ్యూకు రాలేదని చెప్పారు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శివార్లలో వ్యాపారాలు విస్తరించాలి

హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాదవీలత


కోకాపేట్‌లో లైటింగ్ స్టోర్‌ను ప్రారంభించిన మాధవీలత

మణికొండ: హైదరాబాద్ నగర శివార్లలో పెరుగుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, జనాభాకు అనుగుణంగా వారికి సమీపంలోనే వ్యాపారాలు విస్తరించాల్సిన అవసరం ఎంతో ఉందని బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాదవీలత అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట రాయ్‌చందనీ కాంప్లెక్స్‌లో లైటింగ్ పరిశ్రమలో ప్రముఖ బ్రాండ్ అయిన చాంగి లైటింగ్ స్టోర్‌ను వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వ్యాపార సంస్థలు తమ శాఖలను విస్తరించినప్పుడే ప్రజలకు చేరువవుతాయన్నారు. చాంగి లైటింగ్ డైరెక్టర్ కీర్తి బేచార్, లైట్ అలయన్స్ వెంచర్స్ సంస్థ వ్యవస్థాపకుడు రిషబ్ తివారీ, డీలర్లు, ఆర్కిటెక్ట్‌లు, బిల్డర్‌లు పాల్గొన్నారు.

# రోడ్లపై నిర్మాణ సామగ్రి వేసిన వారిపై చర్యలు


నానక్‌రాంగూడలో జరిమానా విధించిన జీహెచ్ఎంసీ ఎస్ఎస్ జలంధర్‌రెడ్డి

- జీహెచ్ఎంసీ అధికారులు
- నానక్‌రాంగూడలో రూ.25 వేలు జరిమాన

రాయదుర్గం: రోడ్లపై నిర్మాణ సామాగ్రి వేసి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే నిర్మాణ సంస్థలకు జరిమానా విధిస్తామని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఎస్ఎస్ జలంధర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన నానక్‌రాంగూడలో సుమధుర నిర్మాణ సంస్థ కట్టడానికి వచ్చే భారీ వాహనాల రాకపోకల సమయంలో నిర్మాణం మిశ్రమం రోడ్డుపైకి వచ్చేలా వేయడం చూసి పెనాల్టీ విధించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి నానక్‌రాంగూడ పర్యటనలో భాగంగ శుక్రవారం ఉదయం ఈ ప్రాంతం మీదుగా వెళుతుండగా నిర్మాణ మిశ్రమం రోడ్డుపైకి వచ్చిన నేపథ్యంలో నిర్మాణ సంస్థకు వెళ్ళి పెనాల్టీ విధించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రూ.25వేల పెనాల్టీ వేశామని, మరోసారి ఇలాంటివి పునరావృతం అయితే లక్ష రూపాయలు వేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇంగ్లిష్ లెర్నింగ్ టూల్ ఆవిష్కరణ

ప్రయోగాత్మకంగా మొయినాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరిశీలన


నూతన ఆవిష్కరణను ప్రయోగాత్మకంగా అమలు చేసి పరిశీలిస్తున్న బృందం

రాయదుర్గం: మాట్లాడే భాషలో నైపుణ్యం కోసం అన్వేషించే ఔత్సాహికులకు సహాయ పడే సాధనాన్ని గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు కీలకం ఇంగ్లిష్. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు ఆంగ్లం నేర్చుకునే వనరులు అందుబాటులో లేవు. దీనిని అధిగమించడానికి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని రాజ్‌రెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీ (ఆర్‌సీటీఎస్) పరిశోధకులు ఇంగ్లిష్ స్పీచ్ మూల్యాంకనానికి టీచింగ్ అసిస్టెంట్‌గా ఉపయోగపడే ఇంగ్లిష్ లెర్నింగ్ టూల్‌ను అభివృద్ధి చేశారు. ట్రిపుల్‌ఐటీలోని ఆర్‌సీటీఎస్‌లోని సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ అర్జున్ రాజశేఖర్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలోని లాంగ్వేజ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ (ఎల్ టీఆర్‌సీ)లోని స్పీచ్ ప్రాసెసింగ్ ల్యాబ్ నుంచి ప్రొఫెసర్ చిరంజీవి యర్రా అభివృద్ధి చేసిన స్పీచ్ అసెస్‌మెంట్‌ను తరగతి గదిలో అభ్యాస సాధనంగా ఉపయోగించవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మార్చిలో ఈ అప్లికేషన్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయడంతో విద్యార్థులు ఉత్సాహంగా స్వీకరించారు. నూతన ఆవిష్కరణపై పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, భక్తులు

రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయ జయధ్వానాల మధ్య వీరాంజనేయస్వామి ఆలయంలో వివిధ దేవతామూర్తుల ప్రతిష్ఠాపనా మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. గోపన్‌పల్లితండాలో స్వయంభూ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈ విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చనలు, పూజలు, అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీరాములు, తిరుపతి, రాజునాయక్, రామ్‌నాయక్, మన్నెరమేష్, ప్రకాశ్, మహేష్, ప్రసాద్, గోపన్‌పల్లితండావాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మోదీ మళ్లీ ప్రధానిగా రావడం ఖాయం


గుడిమల్కాపూర్‌లో కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

గోల్కొండ: మోదీ మళ్లీ ప్రధానిగా రావడం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నాంపల్లి నియోజకవర్గంలోని మెహిదీపట్నం, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ పదేళ్ల పాలనలో మోదీ సాధించిన విజయాలను వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు ఆర్థిక రంగంలోనూ ఘననీయమైన విజయాలు సాధించడం వెనుక ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన ఉందని ఆయన అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయించడం, ప్రధాని మోదీ గొప్పతనం అని ఆయన అన్నారు. చేతివృత్తుల వారికి ప్రధాని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. నాంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానన్నారు.

# పౌరసేవలను పట్టించుకోరా.. ?

- కార్యాలయాల్లో కనిపించని అధికారులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు


మణికొండ మున్సిపల్ కార్యాలయం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సకాలంలో పనులు కాకపోవటంతో ప్రజల పరిస్థితి దయనీయంగా మారుతుంది. మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీకి చెందిన ఓ వ్యక్తి నెల రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో అతడి వారసులు బ్యాంకులు, ఇతర సంస్థలకు వారం రోజుల్లో సమర్పించాల్సి ఉండటంతో మున్సిపాలిటీకి మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల్లో జారీ చేయాల్సిన డెత్ సర్టిఫికెట్ ఏకంగా నెల రోజులైనా జారీ కాకపోవటంతో వారు ప్రతిరోజు కార్యాలయం చుట్టూ.. తిరుగుతున్నారు. ఇదే తరహాలో భాగ్యలక్ష్మి కాలనీలో పలుచోట్ల విద్యుత్ వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

- నెక్నాంపూర్‌లో గత 10 రోజులుగా డ్రైనేజీ, మురుగు సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీప్రియ, హనుమాన్‌నగర్ కాలనీలలో డ్రైనేజీ పనులతో తవ్విన రోడ్డు వేయాలని పలుమార్లు మున్సిపాలిటీలో లేఖలు, ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోతున్నారు. పనులు చేపట్టేందుకు తీర్మానం చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోవటం లేదని, దుమ్ము, దూళితో వేగలేక ఇళ్లను కాలీ చేస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అన్నింటికీ ఒకే సమాధానం..**

మణికొండ మున్సిపాలిటీలో ప్రజలకు దైనందిన జీవితంలో మున్సిపాలిటీ నుంచి అందాల్సిన సేవలను సకాలంలో అందించటంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందని పలు కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు కలిసి, ఫోన్లు చేసి అడిగినా తాము ఎన్నికల విధుల్లో ఉన్నామని, మీ పని తర్వాత చేస్తామనే సమాధానం వస్తుందని చెబుతున్నారు. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, డీఈ, ఏఈ స్థాయి అధికారులతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది సైతం ఇదే విషయాన్ని చెబుతున్నారని తెలిపారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి మణికొండ మున్సిపాలిటీలో సరైన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుని ప్రజలకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



నెలక్రితం డెత్ సర్టిఫికేట్‌కు దరఖాస్తు..

# కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

అబిడ్స్: కురుమ కులస్తులకు ప్రభుత్వం కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు, గ్రేటర్ కాంగ్రెస్ నాయకుడు తూంకుంట అరుణ్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది కరుమలు అండగా ఉండి పార్టీ అధికారంలోకి వచ్చేవిధంగా ఎంతో కృషి చేశారన్నారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కురుమలకు నామినేటెడ్ పదవుల్లో కూడా తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇచ్చి కురుమలకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంపీ ఎన్నికల్లో ప్రతి కురుమ కులస్తుడు కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు నడుం బిగించాలన్నారు. ఈనెల 29న కురుమ కులస్తులు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో పెద్ద ఎత్తున కురుమలు పాల్గొనాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కురుమ కులస్తులకు ఎన్నో విధాల సహకారం అందిస్తుందని, మిగతా కులస్తుల సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరిపల్లి పర్వతాలు, కొంగొల్ల పాండు, గొరిగె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సారస్వత దిక్సూచి సురవరం ప్రతాప్‌రెడ్డి


డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత దిక్సూచి సురవరం ప్రతాప్‌రెడ్డి అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లేల చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాప్‌రెడ్డి గ్రంథస్వీకర్తగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. అతిథులుగా ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి,సురవరం కుమారుడు సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి పాల్గొనగా, భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి స్వాగతోపాన్యాసం చేయగా డాక్టర్ పోరెడ్డి గంగయ్య కార్యక్రమ సమన్వయం చేశాడు. సాహితీ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.